నిలిచిన ఉపాధి పనులు

- వలసబాట పట్టనున్న కూలీలు
- అధికారుల తీరుపై ఆగ్రహం

పుల్లలచెరువు:

అడిగిన వారికి పని కల్పించి వారికి ఆర్థిక భరోసా ఇచ్చే ఉపాధి హామీ పథకం అధికారుల తీరుతో ఆభాసుపాలు అవుతోంది. మండలంలో 19 పంచాయతీలు ఉండగా ఒకటి రెండు తప్ప ఏ గ్రామంలో కూడా ప్రస్తుతం ఉపాధి పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. అందుకు కారణం అధికారులు పర్యవేక్షణ లేక పోవడం. స్థానికంగా ముఖ్య అధికారి పనితీరు కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ఆగిపోయాయి. మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో 20 రోజుల క్రితం నుంచే ఉపాధి హామీ పనులు నిలిపేశారు. వేతనదారులు ప్రస్తుతం పనులు లేక ఇంటికే పరిమితమయ్యారు. చేసేది లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం అడిగిన వారికి పనులు కల్పిస్తామంటూ గొప్పలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో కూలీలకు పనులు కల్పించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో పనులు చేసే వేతనదారులు అధికారులను ఎన్ని సార్లు అడిగినా పనులు కల్పించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలో 19 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు ఒకటి రెండు తప్ప ఏ పంచాయతీలో కూడా పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. ఉపాధి హామీ చట్టం ప్రకారం జాబ్‌కార్డు ఉన్న వారికి 100 రోజులు పని కల్పించాల్సి ఉన్నా పలు గ్రామాల్లోని ప్రజలకు అధికారులు సగం రోజుల పని కూడా కల్పించలేకపోయారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి సిబ్బంది కావాలనే పనులు నిలిపేసినట్లు సమాచారం. పనులు చేయకపోవడంతో వేతనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల ఆదేశాలు మాకెందుకు?

ఇటీవల మండలంలో కలెక్టర్ పర్యటించినప్పుడు గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని, అడిగిన వారికి పని కల్పిస్తూ గ్రామాల్లో ఉపాధి నీటి కుంటలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఉపాధి పనులు అటకెక్కాయి. కనీసం కలెక్టర్ ఆదేశాలను మండలంలో పర్యవేక్షణాధికారి పట్టించుకోవడం లేదంటే ఆ అధికారి నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో జిల్లా అధికారులు గమనించాలి. ఆ అధికారి తీరుపై ఆది నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయనపై జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వేతనదారులు వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పనికి వెళ్లి వచ్చే ఆదాయం ద్వారా కుటుంబ పోషణ చేసేవారు ఎందరో ఉన్నారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వారి ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. పుల్లలచెరువును తీవ్ర కరువు మండలంగా అధికారులు ప్రకటించినా క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జాబ్‌కార్డుల వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	పనిదినాల లక్ష్యం	కల్పించిన పని దినాలు
పుల్లలచెరువు	16,691	7,79,110	3,82,313
పెద్దారవీడ	13,392	4,63,255	4,32,096
వై.పాలెం	19,231	4,79,161	5,84,853
త్రిపురాంతకం	17,535	4,99,161	3,77,568
దోర్నాల	13,492	2,96,00	3,32,505

పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం:



ఉపాధి పనులు ఆగిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎందుకు ఆగిపోయాయో ఎవరూ చెప్పడం లేదు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాలేదు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఈసారి పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం పనులు లేక ఖాళీగా ఉన్నాం. అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు తక్షణమే పనులు కల్పించాలి.

రావూరి నాసరయ్య, ఉపాధి కూలీ, పుల్లలచెరువు

ఉపాధి పనులు కల్పించాలి:



పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ఆగిపోయాయి. ఎందుకు ఆగిపోయాయో అధికారులు విచారణ చేయాలి. అడిగిన అందరికీ పనులు కల్పించాలి. పుల్లలచెరువును తీవ్ర కరువు మండలంగా ప్రకటించినా ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు శూన్యం. ఉపాధి పనులు కల్పించక పోవడంతో కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఉపాధి హామీ పనులు జరిగేలా చూడాలి.

కె.జానకి రఘు, రైతు సంఘ నేత

కౌలు రైతులు పంటల సాగు హక్కు పత్రాలు తీసుకోవాలి

కురిచేడు: భూమి కౌలుకు తీసుకుని సాగు చేసుకునే రైతులు తప్పనిసరిగా వీఆర్వోల వద్ద పంటల సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని తహసీల్దార్ జి. రజనీకుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పంటల సాగు పత్రంపై రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి 951 మంది రైతులకు కౌలు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. వీఆర్వోలు, వీఏఏలు కౌలు రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పించాలని కోరారు. ఏఓ బి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులు కౌలుకార్డులు తీసుకుంటే కలిగే ప్రయోజనాలు వివరించారు. పంటల రుణం, ప్రభుత్వం అందించే పంటల బీమా, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ శాఖ నుంచి రాయితీలు పొందేందుకు తప్పనిసరిగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఉండాలన్నారు. పంట సాగు హక్కు పత్రాలు ఇచ్చినందున భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ముండ్లమూరు (కురిచేడు): ఈ వ్యవసాయ సీజనులో కౌలు రైతులకు కార్డులు తప్పనిసరిగా మంజూరు చేసి ఇవ్వాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులకు కౌలు కార్డులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు వెంటనే కౌలు కార్డులు మంజూరు చేయాలని, గతంలో మంజూరు చేసిన కార్డులు తిరిగి తనిఖీ చేసి అర్హులైన వారికి కౌలుకార్డులు మంజూరు చేయాలని సూచించారు. వ్యవసాయాధికారి తిరుమలరావు, డీటీ శ్రీకాంత్, వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కౌలుకార్డులపై సమీక్షిస్తున్న తహసీల్దార్, ఏఓ

యర్రగొండపాలెం: కౌలు రైతులు పొలాలను కౌలు తీసుకున్నట్లు గుర్తింపు కార్డులు పొందాలని, వ్యవసాయాధికారులు కౌలు రైతులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని తహసీల్దార్ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కౌలు రైతు పంట సాగుదారు హక్కుపత్రం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు కార్డు అర్హత ఉన్న రైతులకు ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు వర్తిస్తాయని, కౌలు చేసే రైతులు పొలం యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఫారం-1, భూ యజమాని, కౌలు రైతులకు మధ్య జరిగిన ఒప్పంద పత్రాన్ని రూ.10 స్టాంప్‌ను జత చేయాలని చెప్పారు. మండలంలో 1238 మందికి కౌలు రైతు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వ్యవసాయ, రెవెనూ సిబ్బంది తమ పరిధిలో ఉన్న కౌలు రైతులను గుర్తించాలని ఆయన ఆదేశించారు. ఏవో కె.నీరజ, ఏఈవోలు టి.పొట్టయ్య, డి.ధనేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

క్లుప్తంగా

చెన్నుపల్లిలో ఆధార్ క్యాంపు



ఆధార్ కార్డు కోసం క్యూ కట్టిన చెంచులు

యర్రగొండపాలెం: మండలంలోని చెన్నుపల్లి గిరిజన చెంచు గూడెంలో అసిస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆధార్ కార్డు క్యాంప్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేక ఆధార్ కార్డు పొందని 36 మందిని గుర్తించి వారితో అర్జీలు దాఖలు చేయించి తహసీల్దార్ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో పుట్టిన తేదీ సర్టిఫికెట్లు పొందుపరిచి ఆధార్ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అసిస్ట్ ఏరియా ఫీల్డ్ కో ఆర్డినేటర్ దారా వెంకట్రావ్, గంజివారిపల్లె సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జె.బాలకృష్ణనాయక్, కార్యకర్తలు బీకే నాయక్, ఎం.వెంటేశం పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడితే ఇబ్బందులే



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సావిత్రి

పెద్దదోర్నాల: డ్రగ్స్ వాడితే జీవితాలు దుర్భరంగా మారతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి పేర్కొన్నారు. గురువారం డిగ్రీ కళాశాలలో జరిగిన ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలు విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు కూడా అవగాహన కలిగి తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని కోరారు. అధ్యాపకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ డ్రగ్స్‌తో ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరుగుతుందని, సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారని హెచ్చరించారు.

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులతో గురువారం డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మోహన్‌రావు మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని, విద్యార్థులు చదువులపై ఆసక్తి కలిగి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటే కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్, కానిస్టేబుళ్లు డి.బ్రహ్మనాయుడు, టి.సాంబశివ, జి.వాసు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి ప్రత్యేక పూజలు

దొనకొండ: మండలంలోని పడమర వెంకటాపురం పంచాయతీ పరిధి బ్రాహ్మణపల్లిలో గ్రామస్తులు ఐక్యంగా ప్రసన్నాంజనేయ ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు జరిగి గురువారం నాటికి 41 రోజులు పూర్తి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడుచులు తలంటి స్నానాలు చేసి ప్రసన్నాంజనేయ స్వామికి ప్రదక్షిణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

తరగతులు పెంచాలంటూ వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ కాలనీ ప్రజలు

కురిచేడు: మండలంలోని ఆవులమంద ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలని ఆ కాలనీ ప్రజలు ఎంఈఓ వస్త్రాంనాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పాఠశాలను ఈ ఏడాది రెండో తరగతి వరకు కుదించి 3వ తరగతి నుంచి కిలోమీటరు దూరంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 45 మంది పిల్లలు ఆ పాఠశాలకు రోడ్లు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, ఒంటరిగా వెళ్లలేకపోతున్నారని, కాలనీలోని ప్రజలందరూ వ్యవసాయ కూలీలు కావటంతో పిల్లలను పాఠశాలలో వదిలి పెట్టి, తిరిగి తీసుకురావటం కుదరక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులు కొనసాగించాలని కాలనీ ప్రజలు కోరుతూ ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో-2 ఇందిర ఆదేశించారు. ఆమె గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ పాలెం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థుల వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలకు ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం అందజేయాలని, పరిశుభ్రమైన ప్రదేశంలో వంట తయారు చేస్తూ రుచికరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా రోజూ రుచి చూడాలని చెప్పారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

సాయిబాబా మందిరంలో విశేష పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్టలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. జూలై 10వ తేదీన నిర్వహించే గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా జూన్ 29వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో బాబావారి భిక్షాటన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తమకు తోచిన విధంగా సాయం అందించాలని కోరుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



నరజాముల తండా వీధుల్లో పర్యటిస్తున్న అధికారులు

- జేసీ గోపాలకృష్ణ

పుల్లలచెరువు: మండలంలోని నరజాముల తండాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని నరజాముల తండాలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డివిజన్ అటవీశాఖాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. నరజాముల తండాలో గిరిజనులు ఇళ్లు కట్టుకునేందుకు నివేశన స్థలాలు, మంచినీటి బోర్లు వేసుకునేందుకు ఎదుర్కొంటున్న సమస్యలు, పెట్టుకున్న దరఖాస్తులను సంయుక్త విచారణ కోసం జిల్లా అధికారుల బృందం తండాలో గురువారం పర్యటించింది. తండాలోని పలు వీధులను సందర్శించి గిరిజనులతో మాట్లాడింది. అనంతరం గ్రామంలో రెవెన్యూ భూమి, అటవీ భూమి విషయంపై విచారణ చేసినట్లు జేసీ గోపాలకృష్ణ తెలిపారు. తండాలో పరిశీలించిన విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎఫ్ఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయి సత్సంగ మందిరంలో పూజలు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



భక్తులు బాబాకు నివేదించిన 108 నైవేద్యాలు

- బాబాకు ప్రత్యేకంగా నైవేద్యాలు

పెద్దదోర్నాల: షిర్డీ సాయి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని 16 రోజులు పూర్తయిన నేపథ్యంలో 16 రోజుల పండగను మండల ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి సత్సంగ మందిరంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం ఆలయంలో భక్తులు ప్రత్యేకంగా 108 రకాల నైవేద్యాలను బాబాకు సమర్పించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు తరలి రావడంతో షిర్డీ సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడింది. బాబా దివ్య దర్శనం చేసుకున్న భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. వేడుకల్లో శ్రీ షిర్డీ సాయి సత్సంగ మందిరంలో వేకువ జామున బాబాను పట్టువస్త్రాలు ప్రత్యేక పూలమాలలతో అలంకరించారు. తెల్లవారు జామున 5 గంటలకు కాకడ హారతి అనంతరం పాలతో బాబాను అభిషేకించారు. ఆలయ అర్చకులు, భక్తులతో సాయి సత్యవ్రతం, పూజా క్రతువు, వ్రతాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

డాక్టర్ బాలయ్య సేవలు అభినందనీయం

కొనకనమిట్ల: ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌గా పని చేసి బదిలీపై వెళుతున్న స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కొనకనమిట్ల ప్రాథమిక వైద్యశాలలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వైద్యులుగా పని చేసి అందరి మన్ననలు పొందిన బాలయ్య బదిలీపై గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక వైద్యశాలలో డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో వైద్య బృందం, సిబ్బంది బాలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, నాయకులు యక్కంటి తురుపతిరెడ్డి, కల్లం దిబ్బారెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, పలు వైద్యశాలల డాక్టర్లు అశోక్‌రెడ్డి, నరేంద్రకుమార్, పనీశ్వర్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ బాలయ్యను సన్మానిస్తున్న వైద్య బృందం

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

బేస్తవారిపేట: మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం పోలేరమ్మ తిరునాళ్ల కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కుంకుమ బండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయన భౌతిక దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘసేవకుడు బీఎస్.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనాథ శవానికి అంత్యక్రియలు చేయడం బాధ్యతగా భావించాలన్నారు. జీవించినంత కాలం ఎన్నో కష్టాలు పడి చివరి దశలో ప్రాణాలున వదిలిన వ్యక్తులను గౌరవంగా అంత్యక్రియలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అన్వేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహు మహరాజ్‌కు ఘన నివాళులు

గిద్దలూరు రూరల్: ఛత్రపతి సాహు మహరాజ్ 151వ జయంతి వేడుకలను పట్టణంలోని సాయి టెక్నో ఒకేషనల్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకుడు కంచర్ల కోటయ్యగౌడ్ మాట్లాడుతూ కొల్హాపూర్‌లో మరాఠాల భోంసలే రాజవంశానికి చెందిన యాదవరాజు సాహు మహరాజ్ ఆయన ఆస్థానంలో 1900-1922 మధ్యకాలంలో బడుగు బలహీన వర్గాల కోసం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టారన్నారు. ఆయన జయంతి సందర్భంగా విద్యార్థులు ఆయన జీవిత చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడి మృతి

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సగినాల సాయిలు (65) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో సోమవారం మృతి చెందారు. భార్య సగినాల రాయలమ్మ రాచర్ల పంచాయతీ సర్పంచ్‌గా ఉండగా, ఆయన ముగ్గురు కుమారులు కూడా ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం సగినాల సాయిలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



సాయిలు (ఫైల్)

నేడు అర్ధవీడు మండల సమావేశం

అర్ధవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ మేడూరి వెంకటరావు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.